ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 116 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 7 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# 42 శాతం రిజర్వేషన్లు ఇస్తారా..
# గద్దె దింపాలా?



### బిసి రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష
### తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంది?
### మోడీపై నేరుగా విమర్శలు గుప్పించిన సిఎం రేవంత్
### ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాల ఉద్వేగ పూరిత ప్రసంగం
### బిజెపి, బిఆర్‌ఎస్ తీరును తూర్పారా పట్టిన రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్ట్6 (ప్రభాత ఉదయం)**

బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే.. ప్రధాని మోడీని గద్దెదించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని.. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులకు ఆమోదం తెలకపపోతే ప్రధాని మోడీని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినా మోడీ ప్రధాని పదవి వదులుకోవడం లేదని.. 75 ఏళ్ల నిబంధన ఆయనకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ గద్దె దిగినా.. దిగకపోయినా.. 2029లో మేమే ఆయనను గద్దె దింపి.. రాహల్ గాంధీని ప్రధానిని చేసుకుంటామని..ఇదే మా శపథమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. విద్యా, ఉద్యోగాలు,

..మిగతా 2లో



# కులగణనతో దేశానికి
# తెలంగాణ రోల్ మాడల్

### 42శాతం రిజర్వేషన్లలో వారికి అండగా నిలబడ్డాం
### బిసి కోటా బిల్లును తొక్కిపెట్టిన మోడీ ప్రభుత్వం
### ఢిల్లీ మహాధర్నాలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్6 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదించామని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. కులగణన చేసి దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీ కోటా బిల్లులను ప్రధాని మోడీ నాలుగు నెలలుగా తొక్కిపెట్టారని విమర్శించారు. బీసీ కోటా బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని ప్రధాని మోడీ భయమని ఎద్దేవా చేశారు.ఢిల్లీలో టీ-పీసీసీ చేపట్టిన బీసీ మహాధర్నా చూసైనా కేంద్రంలోని మోడీ సర్కార్ కు కనువిప్పు కలగాలని..మోడీ తల్చుకుంటే సాయంత్రాని కే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్

..మిగతా 2లో

# బీసీలపై కాంగ్రెస్‌ది దొంగ ప్రేమ

### 50 ఏళ్ల పాలనలో బీసీలకు ఎనలేని నష్టం: బండిసంజయ్

**హైదరాబాద్, ఆగస్ట్6 (ప్రభాత ఉదయం)**

50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీలను పట్టించుకున్న దాఖలాలు ఉన్నాయా?.. సీఎంను చేసిన లెక్కలు ఉన్నాయా ఉంటే చెప్పాలని కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని ఆరోపణలు చేశారు. ఇది కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదని.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనేనని విమర్శలు చేశారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీ వేదికగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీ ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే మద్దతిస్తామని క్లారిటీ ఇచ్చారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు బండి సంజయ్. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? అని నిలదీశారు. తెలంగాణ కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా? అని సవాల్ విసిరారు. లోక్‌సభ సభ్యుల్లో ఎంతమంది

..మిగతా 2లో






# సృష్టి ఫెర్టిలిటీ కేసులో
# 17 మంది అరెస్టు

**హైదరాబాద్, ఆగస్ట్6 (ప్రభాత ఉదయం)**

గోపాలపురం సృష్టి ఫెర్టిలిటీ హాస్పిటల్ కేసులో తాజాగా 6 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారిని రిమాండ్‌కు తరలించారు. ఇప్పటివరకు మొత్తం 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సమాచారం. అరెస్ట్ అయిన వారిలో డాక్టర్లు, ఏజెంట్లు ముఖ్యంగా మహిళా ఏజెంట్లు అధికంగా ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రతపై ఒక్క గోపాలపురం పోలీస్ స్టేషన్‌లోనే 8 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆమెతో పాటు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యులతను కూడా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు డాక్టర్ నమ్రతకు చెందిన బ్యాంక్ ఖాతాలు, హాస్పిటల్ అకౌంట్లు ఫ్రీజ్ చేశారు. ఈ ఖాతాల్లో కోట్ల రూపాయల నగదు జమై ఉందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం మరికొన్ని ఖాతాలను కూడా గుర్తించే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా 70కి పైగా భార్యాభర్తలు ×ఎఖీ చికిత్స కోసం వచ్చి, సరోగసి పేరుతో మోసపోయారని పోలీసులు వెల్లడించారు. సృష్టి ఫెర్టిలిటీ హాస్పిటల్ డాక్టర్ నమ్రత తోపాటు మరికొందరూ చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడ్డట్లు పక్కా ఆధారాలు లభించాయి. గోపాలపురం పోలీసులు మరోసారి సృష్టి హాస్పిటల్‌కి వెళ్లి కీలక డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇవి కేసుకు మద్దతుగా కీలక ఆధారాలుగా మారనున్నాయి. అలాగే, ఈ రోజు మరో కొన్ని అరెస్టులు జరగవచ్చని సమాచారం. నిందితుల జాబితా ఇంకా పెరిగే అవకాశం ఉంది. పోలీసులు డాక్టర్ నమ్రత అనుబంధంగా ఉన్న ఇతర హాస్పిటళ్లను, ఆసుపత్రుల్లోని కార్యకలాపాలను పరిశీలిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బును వేరే అకౌంట్లలోకి మళ్లించి ఉండే అవకాశం ఉన్నందున ఆ దిశగా విచారణ జరుగుతోంది. ఈ కేసు కేంద్రం దృష్టికి వెళ్లే అవకాశం కూడా ఉంది. ఎందుకంటే.. చిన్నారుల అక్రమ రవాణా వంటి విషయాల్లో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించనున్నాయి.




# కర్తవ్యభవన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్6 (ప్రభాత ఉదయం)**

దేశ రాజధాని ఢిల్లీలో ఉమ్మడి కేంద్ర సచివాలయ ప్రాజెక్టు కింద మొత్తం 10 కార్యాలయ భవనాల నిర్మాణాన్ని 22 నెలల్లో పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రకటించింది. వాటిలో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. సీసీఎస్-3గా పరిగణిస్తున్న కర్తవ్య భవన్‌లోకి కేంద్ర హోంశాఖ, విదేశీ వ్యవహారాల శాఖ, పెట్రోలియం శాఖలతోపాటు ప్రధానమంత్రికి ముఖ్య శాస్త్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయాలు తరలివెళ్లనున్నాయి. 2019లో ప్రారంభించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో సిద్ధమైన మొదటి భవనమిదే. ప్రస్తుతం శాస్త్రి భవన్, కృషి భవన్, నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్‌లలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు సీసీఎస్ ప్రాజెక్టు కింద నిర్మితమయ్యే నూతన భవనాల్లోకి క్రమంగా మారిపోతాయి. అన్ని కార్యాలయాలు కొత్త భవనాల్లోకి మారిన తర్వాత పాత భవనాల కూల్చివేతకు టెండర్లు పిలువనున్నట్లు సమాచారం.

# ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు

### కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్ట్6 (ప్రభాత ఉదయం)**

బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింలు ఉండవద్దని ముందు నుంచి బండి సంజయ్ మాట్లాడుతునే ఉన్నారని చెప్పుకొచ్చారు. బీజేపీ బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతి ఒక్క పార్టీతో జై తెలంగాణ అనిపించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీసీల కోసం తాము హైదరాబాద్‌లో 72గంటల పాటు దీక్ష చేశామని ఉద్ఘాటించారు. కోర్టు నుంచి తమకు పర్మిషన్ రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేయడం కాదని, నిజమైన దీక్షలు చేయాలని హితవు పలికారు ఎమ్మెల్సీ కవిత. జాగృతిలోకి వచ్చేందుకు చాలామంది రెడీగా ఉన్నారని.. తమకు అన్నివర్గాల మద్దతు వస్తోందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీల కోసం కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు చిత్తశుద్ధితో పని చేయటం లేదని మండిపడ్డారు. బీసీల కోసం జాగృతి కార్యాచరణ సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లపై బండి సంజయ్ మాట్లాడకపోతేనే విచిత్రమని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని,



అన్ని పార్టీల నాయకులకు లేఖలు రాయాలని సూచించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకొని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాలనీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా, వారి బాటలో తెలంగాణ జాగృతి ముందుకు వెళ్లిందని ఉద్ఘాటించారు. జయశంకర్ సార్ ఆలోచనలను తూచా తప్పకుండా పాటించామని చెప్పుకొచ్చారు. తెలంగాణ చూడకుండానే జయ శంకర్ సార్ దూరం అయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జయ శంకర్ సార్ జయంతి సందర్భంగా జాగృతి ఫౌండేషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలని జయశంకర్ సార్ అనేక సార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలని జయశంకర్ సార్ చెప్పే వారని పేర్కొన్నారు.

## ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ సిద్ధాంతకర్త

# ప్రొఫెసర్ జయశంకర్ , ప్రజా గాయకుడు గద్దర్‌లది కీలక పాత్ర

మక్తల్,06, ఆగస్టు,(ప్రభాత ఉదయం), తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, ప్రజా గాయకుడు గద్దర్ లు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని మక్తల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ రవికుమార్ ఆధ్వర్యంలో... జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల సాధనలో ఉన్న మంత్రి వాకిటి శ్రీహరి ... ఫోన్ లో సందేశం వివరిస్తూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ కృషి ఎనలేనిదని, ఆయనను తెలంగాణ ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ తన పాటలతో ప్రజల్లో చైతన్యం కలిగించారని, అయన అంతిమ యాత్ర లో గద్దర్ పాద స్పర్శ తనకు ఎనలేని అనుభూతి కలిగించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

ఇతర కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ కృషి ఎనలేనిదని కొనియాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో జయశంకర్ సార్ ప్రత్యక్షంగా పాల్గొని, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను బలంగా చాటారని అన్నారు. మలిదశ ఉద్యమంలో సైతం ప్రొఫెసర్ జయశంకర్... అన్ని వర్గాలను కలుపుకొని ఏకం చేసి పార్టీలకతీతంగా అందరిని ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించారని, వారి కృషి కారణంగానే సోనియా గాంధీ సైతం ఆంధ్రలో పార్టీకి ఇబ్బంది అయినా కూడా... తెలంగాణ
ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ న్యాయమైనదని భావించి.. అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకొని తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సహకారం చేశారని అన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ ఆది నుంచి తెలంగాణ ప్రాంతంలో జరుగుతున్న వివక్షత పై పాటల రూపంలో కాలికి గజ్జెలు కట్టి, ప్రజలను చైతన్యపరిచారని, తెలంగాణ రాష్ట్ర సాధనకు అనుకూలంగా గద్దర్ పాత్ర సైతం ఎనలేనిదని ఆయన సేవలను కొనియాడారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో వెన్నంటే నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ తో పాటు, కోదండరాం లాంటి వ్యక్తులను సైతం వాడుకుని వదిలేసిన చరిత్ర కెసిఆర్ దని విమర్శించారు. ప్రజా గాయకుడు గద్దర్ ను సైతం... సీఎం గా ఉన్న సమయంలో కేసీఆర్ కనీసం అపాయింట్మెంట్ఇవ్వకుండా గేటు బయట నిలబెట్టి అవమానించిన చరిత్ర కేసీఆర్ దని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ కు సముచిత స్థాయి, కోదండరాంకు ఎమ్మెల్సీ పదవీ, ప్రజా గాయకుడు గద్దర్ కు ప్రభుత్వ లాంఛనాలతో అంతమ యాత్రలో వీడ్కోలు పలికి అయనకు సముచిత గౌరవాన్ని ఇచ్చారని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు
కట్టా సురేష్ కుమార్ గుప్తా, బి.గణేష్ కుమార్, గొల్లపల్లి నారాయణ, మందుల నరేందర్, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, కల్లూరి గోవర్ధన్ ,టీవీ9 వెంకటేష్, బోయ నరసింహ, రంజిత్ రెడ్డి, ఫయాజ్, శాలం, మహేష్, శంషొద్దీన్, అబ్దుల్ రెహమాన్, నీలాగౌడ్, అఫ్రోజ్, అంజప్ప , వెంకట్ రాములు, అంజప్ప, మొగులప్ప, సురేష్, మీస్కిన్ నాగరాజ్, రఫ్, అశోక్ గౌడ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

## 42 శాతం రిజర్వేషన్లు ఇస్తారా.. గద్దె దింపాలా?

**మొదటి పేజీ తరువాయి...**

రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు. 50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టాం అని అన్నారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు మాత్రమే ఉంటుంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తే దేశ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు ఇస్తున్నారు. అదే విధంగా ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్ధతు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పార్లమెంటులో మోదీ సర్కార్?తో కొట్లాడుతామని ధర్నాకు వచ్చి అండగా నిలిచారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసి దేశానికి రాహుల్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని అంటూ, ఆ హామీ మేరకు 42శాతం చట్టం చేశామని అన్నారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం మేము చేశాం. కేబినెట్ మంత్రులు నాకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేసే అవకాశం నాకు కల్పించారు. దేశానికే ఆదర్శంగా నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని అందిపుచ్చుకుని.. జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు. దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా?మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది?తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా?ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా?పేరు బంధం తెగిన తెరాస పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే.. ఆ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయని ఫైర్ అయ్యారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో మేం బిల్లులు ఆమోదిస్తే.. మా బిల్లును తుంగలో తొక్కే హక్కు మీకు ఎవరిచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## కులగణనతో దేశానికి

# తెలంగాణ రోల్ మాడల్

**మొదటి పేజీ తరువాయి...**

దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కోటా బిల్లు తేవటం చారిత్రాత్మకమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్న మొనగాడు సీఎం రేవంత్ రెడ్డి అని.. ఆయన చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. బీసీ కోటా బిల్లుతో మోడీ పరేషాన్లో ఉన్నారని అన్నారు. ఇన్నాళ్లు బీసీలకు రిజర్వేషన్లు అడిగితే ఏ లెక్కన అడుగుతున్నారని అన్నారు. ఇప్పుడు కుల గణన చేసి ఆ లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని అడుగుతున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కులగణన చేసి అసెంబ్లీలో ఆమోదించామని.. ఇప్పుడు దేశంలోని బీసీలంతా తెలంగాణ వైపు.. రేవంత్ వైపు చూస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ మాట్లాడినా.. తెలంగాణ వైపు చూడండి.. రేవంత్ వైపు చూడండి అని చెప్తున్నారని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ కోటా బిల్లులను నాలుగు మాసాలుగా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఫైర్ అయ్యారు. మోడీకి బీసీల బాధ తెలియాలనే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎప్పుడైనా పనిచేసి గెలిచారా..? ఎప్పుడూ రాముడు, హనుమంతుడు పేరు చెప్పి గెలవాలని చూస్తారని విమర్శించారు. మేము కూడా దేవుళ్లను పూజిస్తాం కానీ దేవుని పేరుతో రాజకీయం చేయం ఓట్లు- అడగమన్నారు. బీజేపీ ముస్లింల పేరు చెప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూస్తోంది. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేకనే ఇలాంటి సొల్లు కబుర్లు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీసీలపై కాంగ్రెస్‌ది దొంగ ప్రేమ

**మొదటి పేజీ తరువాయి...**

బీసీలకు సీట్లిచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీనా బీసీల గురించి తమకు నీతులు చెప్పేది? అని నిలదీశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనని ఉద్ఘాటించారు బండి సంజయ్. 27మంది బీసీ కేంద్రమంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీదేనని బండి సంజయ్ కేంద్రంపై నెపం మోసిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కాంగ్రెస్ నేతలు తప్పుకోవాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ కనుమరుగవడం తథ్యమని బండి సంజయ్ హెచ్చరించారు. ఈరోజు న్యూఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోందే తప్పా బీసీల కోసం కానేకాదని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. మైనార్టీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. బీసీలను ఘోరంగా మోసం చేస్తోంది. అందుకే కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని బండి సంజయ్ ఆక్షేపించారు.



## ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా, ఆశయంగా భావించి తన జీవితాంతం తెలంగాణ రాష్ట్రం సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాక, తెలంగాణ ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ,రాష్ట్ర భవిష్యత్ దిశను సైద్ధాంతికంగా నిర్దేశించిన మహా మేధావి అని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు తెలంగాణ ఉద్యమానికి మేధస్సుతో పాటు మార్గదర్శకత్వాన్ని కూడా అందించాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నిర్మాణం వెనుక ఉన్న శక్తి అయిన జయశంకర్ విద్యారంగంలో చేసిన కృషి, సమానత్వం, ప్రాంతీయ న్యాయం వంటి అంశాలపై ఆయన చేసిన అధ్యయనాలు ఈ తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్తపల్లి జయశంకర్ జీవితాంతం తెలంగాణ హక్కుల కోసం పోరాడిన మహానేతలలో ప్రముఖులుగా నిలిచారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి నుషిత, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజ రెడ్డిని కలిసిన అమెరికా చదువుకు ఎంపికైన విద్యార్థులు

ములుగు, ఆగస్టు 6(ప్రభాత ఉదయం) అమెరికాలోని అలబామ రాష్ట్రంలో ఉన్న Auburn విశ్వవిద్యాలయానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి ఫండింగ్ తో పంపిస్తున్న ఉద్యాన విద్యార్థులు ఈరోజు ములుగు లోని వర్సిటీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల నుంచి ఎస్ రేచల్, వనపర్తి జిల్లా మోచేర్లలోని ఉద్యాన కళాశాల నుండి హర్షిత మారు అనే ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని అబ్రన్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ హార్టికల్చర్ లో విద్యను అభ్యసించడానికి ఎంపికయ్యారు. రెండు సంవత్సరాలపాటు అమెరికాలో చదివే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ద్వారా పూర్తిస్థాయి ట్యూషన్ ఫీజు, లివింగ్ అయ్యే ఖర్చులు, మెడికల్ ఇన్సూరెన్స్, ఇతర అలవెన్స్ సైతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుంది. ఒక్కో విద్యార్థికి సుమారు 55,00,000 రూపాయలు మేర రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. ఆగస్టు 12వ తేదీన విద్యార్థులు అమెరికాకు బయలుదేరునున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజి రెడ్డి మాట్లాడుతూ.... ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఆధునిక ప్రయోగశాల, బోధనాక్షేత్రాలు, ఆధునిక బోధన జరుగుతుందని తెలిపారు. ఉద్యాన విద్యను అభ్యసించిన విద్యార్థులకు విదేశాల్లో బంగారు భవిష్యత్తు ఉందని తెలిపారు. విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు వర్సిటీ కులపతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ జే. చీన, రిజిస్టర్ డాక్టర్ భగవాన్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీనివాసన్, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, మోజెర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆచార్య

# ప్రొ. కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6(ప్రభాత ఉదయం)తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని సాయుధ దళ డి. ఎస్పీ నరేందర్ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సాయుధ దళ డి. ఎస్పీ నరేందర్ రావు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అధికారులు, పోలీస్ సిబ్బంది ప్రొ.జయశంకర్ సార్ చిత్రపటం వద్ద పూలను వుంచి తమ నివాళులను అర్పించారు.ఈ సందర్భంగా డి.ఎస్పీ మాట్లాడుతూ..... సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో




ఉద్యమాలు 1969 తెలంగాణ ఉద్యమం, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్, నాన్ ముల్కీ ఉద్యమం, మలిదశ తెలంగాణా ఉద్యమం లో పాల్గొని దేశ వ్యాప్తంగా వేదికల ద్వారా తన ప్రసంగాలతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి తెలియజేశారు అని తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయంగా స్ఫూర్తిదాయక%శీ%గా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ. ఓ సతీష్ కుమార్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ సంపత్, ఆర్. ఐ వెంకటేష్, ఎస్సై లు సుకూర్, తెజేశ్విని, స్వాతి, డిపిఓ సెక్షన్ అధికారులు, ఐటి, డిసిఆర్బి, ఎస్బి విభాగాల పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతంతో సమానం

## ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ కవిత


తల్లి పాల వారోత్సవాలలో పాల్గొన్న ఐ సీ డీ ఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్లు


గర్భిణీలను సన్మానిస్తున్న ఐ సీ డీ ఎస్ అధికారులు

బుద్వేల్, ఆగస్టు 6(ప్రభాత ఉదయం): బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలని, అవి చాలా శ్రేష్టం అని శేరిలింగంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ కవిత తెలిపారు. బుద్వేల్ సెక్టార్ పరిధిలోని చింతల్మెట్ 2 అంగన్వాడీ సెంటర్ లో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి రెం డు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వడం మంచిదన్నారు. తల్లిపాలు అమృతం తో సమానమన్నారు. అవి మంచి పౌషికాహారం అన్నారు. మొదటి ఆరు నెలల పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుం దన్నారు. అదుకే తల్లి పాలు ముద్దు డబ్బా పాలు వద్దని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు, తల్లులకు అవగాహన


ప్రేమావతీ పేట్ లో....

కల్పిస్తున్నామన్నారు. ఒక మహిళ గర్భవతిగా ఉన్నప్పటి నుంచి రెండేళ్ల బిడ్డ వయస్సు వరకు ఉండే వెయ్యి రోజులు చాలా ముఖ్యమైనవన్నారు. ఈ రెండు సంవత్సరాలు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల కు తల్లులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముర్రుపాలు తప్పక పిల్లలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఉమారాణి, పద్మజ, కోమల్, బుద్వేల్ సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది. స్థానిక నాయకులు తాహేర్ పాల్గొన్నారు.

### ప్రేమావతిపేట్ అంగన్వాడీ కేంద్రంలో.

ప్రేమావతిపేట్ బస్తీ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ గౌరీ తల్లి పాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలకు, స్థానిక మహిళలకు వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని రెండు సంవత్సరాల వయస్సు వచ్చేవరకు పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలు అమృతం తో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వినోద, జయశ్రీ. ఉమారాణి, లత, జ్యోతి లతో పాటు స్థానిక నాయకులు గోల్కొండ రాజ్కుమార్, ఎడ్డకాడి సూర్యం తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బిజెపి నాయకులు శీలం తిరుపతిరెడ్డి, మాడపాటి కిషోర్ కుమార్

## స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవితం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్

### రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి

రాజేంద్రనగర్,ఆగస్టు06 (ప్రభాత ఉదయం) ప్రొఫెసర్ జయశంకర్ సర్ జీవితం తెలంగాణకే అంకితం చేశారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి పేర్కొన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని జయశంకర్ విగ్రహానికికి శీలం తిరుపతిరెడ్డి, మాడపాటి కిషోర్ కుమార్ తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా శీలం తిరుపతిరెడ్డి,మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా బతికిన మహనీయుడు జయశంకర్ సర్ అని కొనియాడారు.తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు,మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన సిద్ధాంతకర్త జయశంకర్ సర్.పుట్టుక నీది, చావు నీది,బతుకంతా తెలంగాణది అని నమ్మి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జీవితాన్ని త్యాగం చేసిన మహనీయులు జయశంకర్ సర్.తెలంగాణ సమాజాన్ని ఉద్యమ బాటలో నడిపిన గొప్ప వ్యక్తి జయశంకర్ సర్ అని పేర్కొన్నారు.

## నిబందనలకు విరుద్ధంగా కొనసాగుతున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

### టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్

బుద్వేల్, ఆగస్టు 6(ప్రభాత ఉదయం) : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నటువంటి జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీ నివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ (డీఐఈఓ)


రంగారెడ్డి జిల్లా డీ ఐ ఈ ఓ భూక్యా నాయక్ కు ఫిర్యాదు చేస్తున్న టీ ఎస్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మి నివాస్

అఫీసర్ బూక్యా నాయక్ ను కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం లక్ష్మీనివాస్ మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అనేక జూనియర్ కళాశాలలు అనుమతులు లేకుండ నడుస్తున్నాయన్నారు. కోచింగ్ సెంటర్ల పేరుతో లక్షల రూపాయలను నిరుపేద ప్రజల నుంచి వసూలు చేస్తు మద్య తరగతి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నటువంటి ప్రైవేటు జూనియర్ కళాశాలలపై విచారణ చేయాలన్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన డీఐఈఓ బూక్యానాయక్ మాట్లాడుతూ. మండలాల వారిగా త్వరలోనే తనిఖీలు చేస్తామని, అనుమతులు లేకుండ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకుం టామన్నారు. అలాంటి కోచింగ్ సెంటర్లు, జూనియర్ కళాశాలలు ఏమైన ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బూక్యానాయక్ న్ను కలసిన వారిలో టీఎస్ఎస్ఈ రాష్ట్ర అధికార ప్రతినిధి మానాజిపేట రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించరా?

బుద్వేల్, ఆగస్టు 6 (ప్రభాత ఉదయం) : రేషన్ కారులను కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు మాత్రమే ఇచ్చిందని. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కనీస ప్రొటోకాల్ పాటించలేదని మైలార్దేవుపల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం సాయం త్రం మైలార్దేవుపల్లి లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఆరాంఘర్ చౌరస్తాలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ అయిన తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వేలాది మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 347 మందికే రేషన్ కార్డులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తు ఒదన్నారు. అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడమేమిటని ఆయన ప్రశ్నించారు.


రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను సన్మానిస్తున్న రాందేవ్ బాబా సంకీర్తన మందిరం నూతన కమిటీ సభ్యులు

## రాందేవ్ బాబా మందిరం అభివృద్ధికి సహకారం అందజేస్తా

### ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, ఆగస్టు 6(ప్రభాత ఉదయం) శివరాంపల్లి లోగల రాందేవ్ బాబా సంకీర్తన మందిర్ నూతన కమిటీ సభ్యులు బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ చేత మందిరంలో పూజలు చేయించారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రకాశ్ గౌడ్ ను సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, రాందేవ్ బాబా ఆలయ అభ్విద్ధికి ఎల్లవేళలా తన సహయ సహకారాలు అందిస్తానన్నారు. నూతన కమిటీ ఆధ్వర్వంలో మందిరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాందేవ్ కీర్తన మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాకారంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవలు గొప్పవి

బుద్వేల్, ఆగస్టు 6 (ప్రభాత ఉదయం) ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని బుధవారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో జయశంకర్ సార్ చిత్రపటానికి వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ పూలమాలలు వేసి శ్రద్ధాం జలి ఘటించారు. తెలంగాణ ఉ ద్యమం విజయవంతపై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారం కావడానికి జయశంకర్ సార్ కారణమని విద్యాసాగర్ అభిప్రాయపడ్డారు. అటువంటి నిస్వార్ధ, నిజాయితీపరుడైన జయశంకర్ సార్ పేరును వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పెట్టడం మనకం దరికి గర్వకారణమని ఉద్యోగులకు వివరించారు. జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిం చడానికి అందరు కృషి చేయాలన్నారు. వర్శిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం.యాకాద్రి, సీడ్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్, వర్శిటీ బీసీ సెల్ ఆఫీసర్ ఇంచార్జి డాక్టర్ సీహెచ్ దామోదర్ రాజు ఇతరులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు. బోధన, బోధనేతర, కాంట్రాక్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. జయశంకర్ సార్ అమర్ రహే అంటు నినాధాలు చేశారు.


ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు

### తెలంగాణ స్ఫూర్తి ప్రధాత జయశంకర్ సార్ :

స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన గొప్ప వ్యక్తి, తెలంగాణ స్ఫూర్తి ప్రధాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని ప్రేమావతిపేట్ జై భీమ్. జై రామ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోల్కొండ రాజ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ సిద్ధాంత కర్తగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఒక ప్రణాళికతో ముందుకు సాగేలా ఆనాటి ఉ ద్యమంలో ఉన్న వారికి సూచనలు, సలహాలు ఇస్తు ముందుకు నడిచిన వారిలో అచార్య జయశంకర్ సార్ అగ్రగణ్యులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్లకాడి సూర్యం, లేవిరాజ్, నర్సింహ్మా, దావీదు, గడ్డం సత్తయ్య, నడికూడ యాదరిగి, ఎరుకలి రాజలింగం, గోల్కొండ రాములు, బర్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు


ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రేమావతిపేట జై భీమ్ జై రామ్ సంఘం సభ్యులు

